


పెగ్గెర్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు

# బీడు భూములను సాగులోకి తెచ్చినం

- 'ఎత్తిపోతల'తో మండలాన్ని సస్యశ్యామలం చేసినం
- కథలాపూర్ మండల ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్, నవంబర్ 18: 'ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురై, సాగుకు నోచుకోని బీడు భూములను స్వరాష్ట్రంలో కేసీఆర్ సర్కారు హయాంలో సాగులోకి తెచ్చినం. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మండలాన్ని సస్యశ్యామలం చేసినం. కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాంతం అప్పుడెట్లుండె.. ఇప్పుడు ఎట్లయిందో.. ప్రజలు గమనించాలి'.. అని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. గడపగడపకూ గులాబీ జెండా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డితో కలిసి కథలాపూర్ మండలంలోని పోసానిపేట, కథలాపూర్, సిరికొండ, పెగ్గెర్ల, ఊట్‌పల్లి, భూషణ్‌రావుపేట, చింతకుంట, రాజారాంతండాలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలో తెలంగాణ ప్రాంతం ఎలా ఉండేది.. గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లలో ఎలా ఉందో ప్రజలు గమనించాలన్నారు. వరద కాలువ ద్వారా కథలాపూర్ మండలంలో 365రోజులు నీళ్లు నిల్వ ఉండేలా చేసి, ప్రతి ఎకరానికి సాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు కేవలం వ్యక్తుల మధ్య జరుగుతున్నవి కాదు.. తెలంగాణ భవిష్యత్ ఎట్లా ఉండాలో నిర్ణయించేవన్నారు. ఆలోచించి ఓటేసి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వస్తున్న తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే.. గెలిచిన 9నెలల్లోపు సిరికొండ-తక్కళ్లపల్లి రోడ్డు నిర్మాణంతోపాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన చల్మెడకు స్థానిక మహిళలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. గొల్లకురమ సోదరులు గొర్రె పిల్లను అందించి అభిమానాన్ని చాటుకున్నారు. పోసానిపేటలో పలువురు యువతులతో చల్మెడ ఆప్యాయంగా మాట్లాడి, మహిళలకు అందిస్తున్న పథకాలను వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసేలా గ్రామస్తులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీపీ జవ్వాజి రేవతి-గణేశ్, వైస్‌ఎంపీపీ కిరణ్‌రావు, పార్టీ మండలాధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఏఎంసీ చైర్మన్ గుండారపు సౌజన్య-గంగాధర్, వైస్ చైర్మన్ సోమ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చుక్కా దేవరాజం, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ మహిపాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు గడ్డం భూమారెడ్డి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు ఎంజీ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు బొడ్డు బాలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే జీవితాలు ఆగమే

- రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అయితది
- కష్టాలే దిక్కయితయి.. పథకాలు రావు
- మూడు గంటల కరెంటిచ్చే ఆ పార్టీ కావాలా..? 24 గంటల బీఆర్ఎస్ కావాలా..?
- ప్రజలారా మీరే ఆలోచించాలి
- ధర్మపురి అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్
- మద్దులపల్లి, బతికపల్లిలో ప్రజా ఆశీర్వాద యాత్ర



మద్దులపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి ఈశ్వర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

పెగడపల్లి, నవంబర్ 18: 'తమది గొప్ప పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని ఏండ్ల కొద్ది పాలించి, అధ్వానం పట్టించింది. చీకటి బతుకులు చేసింది. ఒక్క అభివృద్ధి చేయలే. ప్రజలకు సమస్యలు తప్ప, సంతోషం లేకుండా చేసింది. ఇప్పుడు మళ్లీ గ్యారెంటీలంటూ అసత్య ప్రచారం చేస్తూ జనాలను మభ్యపెడుతున్నది. నేనొక్కటే చెబుతున్నా.. కాంగ్రెస్ చెప్పే మాటలను నమ్మి ఓటేశారో..? జీవితాలు ఆగమవుతయి. రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరే అవుతుంది'' అని ధర్మపురి అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. కాంగ్రెస్ వస్తే రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్తుందని, మళ్లీ చీకటి కష్టాలు మొదలవుతాయని, పథకాలు బందైపోతాయని చెప్పారు. పెగడపల్లి మండలం మద్దులపల్లి, బతికపల్లి గ్రామాల్లో శనివారం ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర చేశారు. ఆయాచోట్ల మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. బొట్టుపెట్టి మరీ ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో మాట్లాడారు. తన జీవితం ప్రజా సేవకే అంకితమని, ప్రజల కోసమే అనునిత్యం 18 గంటల పాటు పని చేస్తున్నానని చెప్పారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని, ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. రైతులకు 3 గంటల కరంటే చాలని రేవంత్‌రెడ్డి బాహాటంగానే చెబుతున్నారని, సాగుకు మూడు గంటలు చాలా..? అని ప్రశ్నించారు. ఇంకా 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని సాగు నీరు పారించుకోవాలని అంటున్నాడని, ఇది సాధ్యం అవుతుందా..? అన్నారు. ఇటువంటి కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని, మూడు గంటల కరంటే దిక్కవుతుందని, పథకాలు బందైపోతాయన్నారు. 24 గంటల కరెంట్ కావాలంటే.. అభివృద్ధి, సంక్షేమం జరుగాలంటే.. బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని సూచించారు. స్వరాష్ట్రంలో తెలంగాణ గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, ప్రజలకు న్యాయం జరుగుతున్నదని చెప్పారు. ముఖ్యంగా దేశానికి అన్నం పెట్టే రైతన్న జీవితాన్ని బాగు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. తన పదవీ కాలంలో ఈ ప్రాంతం అభివృద్ధికి ఎంతో చేశానని, ప్రజలు మళ్లీ ఆశీర్వదించి గెలిపించాలని, పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నేత రమణారావు, జడ్పీటీసీ రాజేందర్‌రావు, ఎంపీపీ శోభా-సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ లోక నిర్మల, సర్పంచ్ అనూష-మల్లారెడ్డి, ఎంపీటీసీ స్వాతి-తిరుపతిరెడ్డి, విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, వెంకన్న, మండల అడ్‌హక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఆనందం, కరుణాకర్‌రావు, యూత్ అధ్యక్షుడు సంతోష్, వైస్ ఎంపీపీ గంగాధర్, ఆర్బీఎస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆంజనేయులు, పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, రఘునందన్, తిరుపతి, సత్యనారాయణరెడ్డి, జైపాల్‌రెడ్డి, షకీల్, వెంకటేశం, మనోహర్, గంగాధర్, రాజయ్య, రాజేశ్వర్‌రెడ్డి, కిషన్, రాయమల్లు, శ్రీనివాస్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

# మీ బిడ్డ కావాలా..? పరాయివాళ్లు కావాలా..?



- ప్రజలారా మీరే నిర్ణయం తీసుకోండి
- బీజేపీ నాయకుడు ఎంపీగా గెలిచి చేసిందేమీ లేదు
- కాంగ్రెస్ నాయకుడు ఐదేండ్లకోసారి వస్తడు
- నేను మీ బిడ్డగా ఎప్పటికీ అందుబాటులో ఉంట
- ఆలోచించి ఓటేయండి.. ఆశీర్వదించండి
- ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దు
- కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్
- ఇబ్రహీంపట్నం మండలంలో ఎన్నికల ప్రచారం

ర్యాలీలో గ్రామస్తులకు నమస్కరిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

ఇబ్రహీంపట్నం, నవంబర్ 18: 'బీజేపీ నాయకుడు ఎంపీగా గెలిచి ఐదేండ్లలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. కులాలు, మతాల పేరిట గ్రామాల్లో చిచ్చు పెట్టడమే తప్పా ఒక్క కుల సంఘానికైనా నిధులిచ్చారా..? ఒక్కసారి ఆలోచించాలి. ఇగ కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి నర్సింగరావు ఐదేండ్ల క్రితం వచ్చిండు. మళ్లీ ఓట్లప్పుడు వచ్చి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అంటున్నడు. ఎన్నికలు వస్తున్నాయంటే వచ్చే వాళ్లను నమొద్దు. మీకు ఎప్పుడూ అందుబాటులో ఉండే మీ బిడ్డ కావాలా..? పరాయివాళ్లు కావాలా..? మీరే ఒకసారి ఆలోచించుకోవాలి' అని కోరుట్ల అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విజ్ఞప్తి చేశారు. మీకు అందుబాటులో ఉండి సేవలందించే తనను గెలిపిస్తే, మరింత అభివృద్ధి చేస్తానని ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆయన ఇబ్రహీంపట్నం మండలంలోని కేశాపూర్, కోజన్‌కొత్తూర్, ఎర్దండి, మూలరాంపూర్, బర్ధిపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు. గ్రామ శివారులో నుంచి ప్రధాన కూడలి వద్దకు ర్యాలీగా తీసుకెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నియోజకవర్గంలో ఐటీ హబ్ ఏర్పాటు చేశానన్నారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మి మోసపోవద్దని, ఎన్నికలు వస్తున్నాయంటే కాంగ్రెస్, బీజేపీ వాళ్లు వస్తారని, మాయ మాటలు చెప్పి మోసం చేస్తారన్నారు. అటువంటి వాళ్లను నమ్మవద్దన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు మూడు గంటలిస్తామంటున్న రేవంత్‌రెడ్డి కావాలా..? మరీ 24 గంటలు ఉచితంగా కరెంటిచ్చే కేసీఆర్ ప్రభుత్వం కావాలా..? ప్రజలే ఆలోచించాలన్నారు. సీఎం కేసీఆర్ అరవై ఏండ్ల దరిద్రాన్ని పారదోలి, తొమ్మిదేండ్లలోనే అభివృద్ధి చేసి చూపించాడన్నారు. అటువంటి నాయకుడిని వదులుకుందామా..? చెప్పాలన్నారు. తెలంగాణ ప్రజల కోసం అహర్నిషలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. రైతులను ఏనాడు పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు ఏం ముఖం పెట్టుకుని, ఇప్పుడు ఓట్లడిగేందుకు వస్తుందన్నారు. అలాంటి వారిని నమ్మవద్దని, పనిచేసే ప్రభుత్వానికి అండగా నిలువాలన్నారు. సీఎం కేసీఆర్ మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాడని, బీడీ కార్మికులకు ఎలాంటి కటాఫ్ డేట్ లేకుండా పింఛన్ అందిస్తాడన్నారు. తన తండ్రిని ఆదరించినట్లుగానే తనను కూడా ఆదరించి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోన్‌కంటి వెంకట్, సర్పంచులు దాసరి పోశెట్టి, ఆవుల మహేశ్, కల్లెడ లక్షణ, బాసెట్టి చిన్ననర్సయ్య, సంగం సాగర్, ఎంపీటీసీ బోనగిరి గంగు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎలాల దశరథ్‌రెడ్డి, నాయకులు నేమూరి సత్యనారాయణ, జాజాల జగన్‌రావు, కంఠం రమేశ్, చిన్నారెడ్డి, జేడీ సుమన్, బోనగిరి భూమేశ్, దాసరి చిన్నరాజన్న, కల్లెడ గంగాధర్, గణేశ్, నేమూరి నరేశ్, నర్సాగౌడ్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.




ఎర్రాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

# మోసపోతే గోసపడుతాం

### ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

ఇబ్రహీంపట్నం, నవంబర్ 18: కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోతే గోసపడుతామని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు హెచ్చరించారు. కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్లకు మద్దతుగా శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్రాపూర్, ఎర్రాపూర్ తండాలో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణను ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. మరో మారు బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు అవకాశమిచ్చి గెలిపించాలని కోరారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని బీడీ పింఛన్‌ను తెలంగాణలో సీఎం కేసీఆర్ అందిస్తున్నారన్నారన్నారు. గిరిజనులకు పోడు భూముల హక్కులను కల్పిస్తానన్నారు. విద్యార్థులకు ఉద్యోగవకాశాలను కల్పించేందుకు కోరుట్లలో ఐటీ హబ్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని, ఉద్యోగ బాధ్యతలు తన తనయుడిదే అన్నారు. తనను ఆదరించినట్లుగానే తన కుమారుడిని ఆదరించి బారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచ్ నునావత్ శాంతాబాయి, ఎంపీటీసీ మాలావత్ సరోజ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేశ్, నాయకులు వెంకట్, జవహర్‌లాల్, రాజేందర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.